
సాక్షి బాపట్ల

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



శాశ్వత పరిష్కారం

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండ రాళ్లు జారిపడకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ పేర్కొన్నారు.



సాగు నీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం నీటి విడుదలను ఆపేశారు. బ్యాంక్ కెనాల్‌కు 492 క్యూసెక్కులు వదిలారు.



ఘాట్‌రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి ఘాట్ రోడ్డును అధికారులు మూసివేశారు. శనివారం కొండ చరియలు విరిగిపడిన నేపథ్యంలో అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

ముంచెత్తిన వాన

- జిల్లాలో అల్పపీడన ప్రభావం
- కొనసాగుతున్న భారీ వర్షాలు
- చుండూరులో అత్యధికంగా 17 సెం.మీ.
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు
- జల దిగ్బంధంలో ప్రధాన రహదారులు
- పలుచోట్ల ఇళ్లలోకి చేరిన వర్షపునీరు
- జిల్లావ్యాప్తంగా స్తంభించిన జనజీవనం



స్వర్ణ - తిమిడెదపాడు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న ఆలేరు వాగు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బాపట్ల జిల్లాలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా భారీ ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. శనివారం రాత్రి 9 గంటల సమయానికి వేమూరు నియోజకవర్గం చుండూరులో అత్యధికంగా 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదే నియోజకవర్గంలోని అమృతలూరులో 13.6, రేపల్లె నియోజకవర్గంలోని నగరంలో 13.5 సెం.మీ. చొప్పున నమోదైనట్లు అధికారులు తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు 12, వేమూరులో 11.5 సెం.మీ. కురిసింది. పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లులో అత్యల్పంగా 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో 7 - 11 సెం.మీ. మేర పడింది. జిల్లావ్యాప్తంగా సరాసరి 9 సెం.మీ.గా నమోదైంది. శనివారం సాయంత్రానికి వర్షం కొంత తగ్గుముఖం పట్టింది. రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖతోపాటు రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్లు ఇచ్చారు. భారీ వర్షాలతో జిల్లావ్యాప్తంగా రహదారులు నీట మునిగాయి. చాలా చోట్ల వరి పంట నీట మునిగింది. జిల్లావ్యాప్తంగా 1,03,784 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా.. 43,500 హెక్టార్లలో వరి సాగైంది. 45 గ్రామాల పరిధిలో 122 ఎకరాల వరి నారు మళ్లు నీటిలో మునిగాయి. 4,441.75 ఎకరాలలో వరి నాట్లదీ అదే పరిస్థితి. దీంతో 2,070 మంది రైతులకు నష్టం వాటిల్లింది.

- జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలా ఇళ్లలోకి నీరు చేరింది. ఈదురు గాలులకు చెట్లు నేలకొరగడంతో విద్యుత్తు, అగ్నిమాపక శాఖల వారు వాటిని తొలగించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలలోకి సైతం వర్షపు నీరు చేరింది.

వర్షాల వల్ల వారంపాటు వేటకు నిషేధం కావడంతో నిజాంపట్నం, బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని 10,500 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఇబ్బంది తప్పడం లేదు. జోరువానతో జనజీవనం స్తంభించింది. చిరు వ్యాపారులకు నష్టాలు తప్పని పరిస్థితి నెలకొంది. వర్షాలతో ఇప్పటికే జిల్లాలో ఉధృతంగా ఉన్న డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు, ఇతర వ్యాధులు విజృంభించే అవకాశముంది. జిల్లాలో ప్రస్తుతానికి అధికారికంగా 94 డెంగీ కేసులు ఉన్నా.. అనధికారికంగా వీటి సంఖ్య వందల్లో ఉంది. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో వర్షాలతో పరిస్థితి మరింత దిగజారనుంది. వర్షాలతో అటు మేకలు, గొర్రెలు, ఇతర పశువులకు గిట్టలవాపు, బొబ్బ, గాలికుంటు తదితర వ్యాధులు సోకే అవకాశముందని వైద్యులు తెలిపారు.

- బాపట్ల నియోజకవర్గంలో ఇప్పటికే సాగైన వరి పొలాలు నీట మునిగాయి. వేరుశనగ, మొక్కజొన్న, పొగాకు, పత్తి, మిర్చి కూరగాయల పంటలకు ప్రస్తుతానికి ఇబ్బంది లేదు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే భూమిలో వేర్లు నాని పంటలు నాశనం అయ్యే ప్రమాదముంది.
- భారీ వర్షాలతో రేపల్లె నియోజకవర్గం పరిధిలో 15 రోజుల క్రితం నాట్లు వేసిన వేలాది ఎకరాల వరి పంట నీట మునిగింది.
- వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, వేమూరు, కొల్లూరు మండలాల్లో వరి పంట నీటిపాలైంది. పంట పొలాలు చెరువులను తలపించాయి. మరో రెండు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే వరి పంట పూర్తిగా నాశనం అయ్యే ప్రమాదముంది. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని 11 వేల ఎకరాల్లో ఉన్న అరటి, కంద, తమలపాకు తోటలకు వర్షం వల్ల ప్రస్తుతానికి ఇబ్బంది లేదు. కృష్ణా వరద ఉధృతి వల్ల కొల్లూరు మండలం దోనెపూడి , భట్టిప్రోలు మండలం పల్లెపాలెం కరకట్ట పరిధిలో లోలెవల్ సప్టాపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగింది. కొల్లూరు మండలం తిప్పలకట్ట, కృష్ణానగర్, భట్టిప్రోలు మండలం పల్లెపాలెం, వోలేరు గ్రామాల పరిధిలో కరకట్ట కోతకు గురైంది.
- పర్చూరు నియోజకవర్గంలో పంటపొలాలు నీట మునిగాయి. చెరువులు, కుంటలకు నీరు చేరింది. వరద కాలువలకు వరద పోటెత్తింది.
- అద్దంకి నియోజకవర్గంలో వర్షం వల్ల కోత కోసిన కొద్దిపాటి నూగు పంటకు మినహా మిగిలిన మొక్కజొన్న, కంది, జూటు, పత్తి, పశువుల మేతలకు నష్టం లేదు. వర్షం మరో రెండు రోజులు ఇలాగే ఉంటే పత్తి, మినుము పంటలకు నష్టం వాటిల్లనుంది.
- చీరాల నియోజకవర్గంలో ప్రస్తుతానికి కొద్దిపాటి వేరుశనగ పంట తప్ప వరి, ఇతర పంటలు సాగు కాలేదు. ఇసుక నేలలు కావడంతో సాగులో ఉన్న వరి పంటకు కూడా పెద్దగా నష్టం కలగలేదు.



ఈపురుపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న స్ట్రయిట్ కట్ కాలువ



చినపరిమి గ్రామంలో కూలిన చెట్టు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- బాపట్లలో ప్రత్యేక కంట్రోల్ రూము
- ఫోన్ నెంబరు 87126 55881
- జిల్లా కలెక్టర్ వెంకట మురళి



బాపట్ల: జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతానికి చెందిన ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పట్టణంలోని శారదపురి కాలనీ, వెన్నెలకంటి నగర్, ప్యాడిషనల్ పేటలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ పర్యటించారు. శారదపురి కాలనీలో డ్రైనేజీకి అడ్డంగా ఉన్న రోడ్డును తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. పట్టణంలో 5 వేల మందికి భోజన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెంకట మురళి ప్రకటించారు. అత్యవసరమైతే 24 గంటలూ 87126 55881 ఫోను నెంబరులో సంప్రదించవచ్చని తెలిపారు. బాపట్ల, రేపల్లె, చీరాల ఆర్డీవో కార్యాలయాలలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

రేపల్లె రూరల్: తుపాను హెచ్చరికలతో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకాశం బ్యారేజ్ నుంచి వస్తున్న వరద ఉధృతి నేపథ్యంలో రేపల్లె తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి అధికారులను ఆదేశించారు. రేపల్లె పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం సాయంత్రం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. నది పరివాహక ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లనీయవద్దని సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే జన జీవనానికి ఆటంకం లేకుండా వెంటనే తొలగించాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్ శేషగిరిరావు, ఆర్డీఓ హెలా షారోన్ పాల్గొన్నారు.



కొల్లూరు అంబేడ్కర్ కాలనీలో వర్షపు నీరు ఇంట్లోకి ప్రవేశించడంతో బయటకు తోడుతున్న గృహిణి



కర్లపాలెం పశు వైద్యశాలలోకి చేరిన వర్షపు నీరు



తిమిడెదపాడు వద్ద ఆలేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐలు



చీరాల చర్చి కాంపౌండు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



కొల్లూరు మండలం దోనేపూడి సమీపంలో ముంపులో పసుపు పంట



గోకరాజునల్లిబోయినవారి పాలెంలో నీట మునిగిన వరి పైరు

న్యూస్‌రీల్

జిల్లా అధికారుల తీరుపై విమర్శలు

- జేసీ వీడ్కోలు వేడుకలో అందరూ బిజీ
- మరోవైపు వర్షాలతో ప్రజలు సతమతం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు పదవీ విరమణ కార్యక్రమం చర్చనీయాంశంగా మారింది. ఒక వైపు అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేస్తుంటే .. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఆ కార్యక్రమ సంబరాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు విమర్శలు వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ వెంకట మురళితోపాటు పార్లమెంట్ సభ్యుడు కృష్ణప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వర్మ, జిల్లా స్థాయి అధికారులు ఇక్కడే గడిపారు. ఆయనను పొగడ్తలతో ముంచెత్తారు. సుబ్బారావు గత జూలై 11న బాపట్ల జిల్లా జేసీగా బాధ్యతలు చేపట్టారు. కొన్నాళ్లే పనిచేసినా పదవీ విరమణ వేడుకకు జిల్లా నలుమూలల నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పలువురు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు. అధికారికి వీడ్కోలు సభ ఏర్పాటు చేయడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదు. భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యలు పట్టించుకోకుండా ఇలా చేయడం ఏంటనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుబ్బారావు విరమణ తర్వాత వెంటనే రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఓఎస్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారన్న వార్తల నేపథ్యంలోనే అధికారగణం ఇంత ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రెస్క్యూ పరికరాలతో సిద్ధంగా ఉండండి

నరసరావుపేట: అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు రెస్క్యూకు కావాల్సిన పరికరాలతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఆదేశించారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫోన్ నెంబర్ 94407 96184, 91548 80760, 91548 80761, 94906 19394, ల్యాండ్‌లైన్ నం .08647-229999 నెంబర్లకు ఫోన్‌చేసి సమస్యను తెలియజేసి తక్షణ సహాయం పొందవచ్చునని ప్రజలకు సూచించారు. కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ కోరారు. కార్మిక, బీఎస్‌ఎన్‌ఎల్ శాఖల అధికారులతో శనివారం కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం అయ్యే దిశగా కృషి చేయాలన్నారు. అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎ.పూర్ణిమ, కె.మధుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలు

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆగష్టు నెల మొత్తం పట్టణంలోని పాఠశాలలు, విద్యాలయాలు, వసతి గృహాల్లో చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యశ్రీ తెలిపారు. రోజు వారి జీవితంలో అవసరమయ్యే చట్టాలు విద్యాహక్కు చట్టం, ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలను వివరించినట్లు తెలిపారు.

భారీ వర్షాల దృష్ట్యా రైల్వే హెల్ప్‌లైన్ ఏర్పాటు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే డివిజన్ పరిధిలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా అనేక రైళ్లను దారి మళ్లించడంతో పాటు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. వివరాలు తెలుసుకోవడానికి హెల్ప్‌లైన్ నంబర్లను (గుంటూరు రైల్వే స్టేషన్- 9701379072, నరసారావుపేట- 9701379978, నల్గొండ- 9030330121, మిరియాలగూడ- 8501978404, నంద్యాల- 7702772080, దొనకొండ- 7093745898, నడికుడి- 7989875492) సంప్రదించాలని ఆయన సూచించారు.

పింఛన్ల పంపిణీ వేగవంతం చేశాం

-జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో ప్రభుత్వం పేదలను ఆదుకుంటోందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. పింఛను పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శనివారం బాపట్లలో ప్రారంభించారు. ఉదయం 6 గంటలకు భీమావారిపాలెం నకు చేరుకుని, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించారు. నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ చేస్తామని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ సచివాలయాల సిబ్బంది పంపిణీలో నిమగ్నం అయ్యారన్నారు. జిల్లాలో 2.31 లక్షల మంది లబ్ధిదారులకు రూ.96.24 కోట్ల నగదు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ వై. పిచ్చిరెడ్డి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, బాపట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ జిట్టా ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

వరద పరిస్థితిని పరిశీలించిన ప్రత్యేకాధికారి



భట్టిప్రోలు కాకులడొంక రేవు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న శేషగిరిబాబు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో వరద పరిస్థితిని పరిశీలించేందుకు జిల్లా ప్రత్యేకాధికారి శేషగిరిబాబు(ఐఏఎస్) పెదలంక కాకులడొంక రేవును సందర్శించారు. శనివారం అధికారులతో, గ్రామస్తులతో మాట్లాడారు. అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భట్టిప్రోలు టీఎంరావు, వెల్లటూరు జెడ్పీ హైస్కూళ్లల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం . హనుమంతరావు, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, మండల సర్వేయర్ బి. శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్వో మంద్రు జక్రయ్య, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, సచివాలయ సిబ్బంది ఉన్నారు. మండలంలోని పెసర్లంక, పెదలంక, చింతర్లంక ప్రాంతాలలో పర్యటించిన ఆయన అరవింద వారధి వద్ద వరద తీవ్రతను కూడా ఆయన పరిశీలించారు.

తీర ప్రాంత గ్రామాల్లో అప్రమత్తంగా ఉండండి




పల్లెపాలెం ప్రజలతో మాట్లాడి అప్రమత్తం చేస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ రెడ్డి

చినగంజాం: తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అధికారులు తక్షణ చర్యలు చేపట్టేందుకు నిత్యం సిద్ధంగా ఉండాలని చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఆయన చినగంజాం మండలంలోని పల్లెపాలెం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ప్రజలను, అధికారులను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. అదే విధంగా ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. గర్భిణులు, అనారోగ్యం ఉన్న వారిని గుర్తించి తొలుత మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గే వరకు జాగ్రత్తలు పాటించండి


- ప్రజలకు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ వినతి



బాపట్ల టౌన్: వర్షాలు పూర్తిగా తగ్గేవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. వంతెనలు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తుంటే దాటే ప్రయత్నం చేయరాదన్నారు. జిల్లాలో ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్న కాలువలు, వాగులు, నదుల పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో, వరద ముంపునకు గురవడానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లోని ప్రజలు ప్రభుత్వం సూచించిన పునరావాస కేంద్రాల్లోకి వెళ్లాలన్నారు. వీలైనంత వరకు దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. ప్రజలు ప్రమాదాలకు గురికాకూడదనే ఉద్దేశంతో పోలీసులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలు పోలీసుల తక్షణ సహాయం కోసం డయల్ 100, స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

మహిళలు, విద్యార్థినులకు రక్షణ కరువు

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబు



భట్టిప్రోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, విద్యార్థినులకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ .. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో రహస్య కెమెరాలు పెట్టి వీడియోలు తీసి బయటకు పంపుతున్నారంటే ఆడపిల్లల రక్షణ పట్ల కూటమి ప్రభుత్వం ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందన్నారు. సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ఉన్న ఈ సంఘటనపై కళాశాల యాజమాన్యం, అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. పోలీసులు కూడా తక్షణమే స్పందించకపోవడం చూస్తుంటే ఇది నిజంగా ప్రభుత్వ ఘోర వైఫల్యమేనన్నారు. తప్పు చేసిన దోషులను వదిలేసి ఫిర్యాదు చేసిన విద్యార్థినులపై కేసులు పెడతామని బెదిరించడం చూస్తుంటే అసలు ప్రభుత్వ ధోరణి ఏంటో అర్థం కావడంలేదన్నారు. రాజకీయ వేధింపులకే కూటమి ప్రభుత్వం పరిమితమైందని విమర్శించారు. ఆడపిల్లల సంరక్షణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశ యాప్‌తో మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. మంత్రులు చంద్రబాబును ప్రశ్నించే ధైర్యం చేయలేక జగన్‌ను విమర్శిస్తూ సుఖంగా నిద్రపోతున్నారని పేర్కొన్నారు. హోం మంత్రి అనిత ప్రెస్ మీట్‌లు పెట్టి జగన్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. కళాశాలలో విద్యార్థినులకు కూడా రక్షణ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండటం విచారకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థినుల మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రహస్య కెమెరాలు పెట్టిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అశోక్‌బాబు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని యాచకుడు మృతి



అద్దంకి రూరల్: గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం శింగరకొండ దేవస్థానం వెనుక ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్సై ఖాదర్‌బాషా వివరాల మేరకు.. బిబిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి (60) మండలంలోని శింగరకొండ దేవస్థానం వెనుక భాగంలో ఉన్న బట్టలు మార్చుకునే షెడ్డు వద్ద శనివారం సాయంత్రం మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై, సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యర్రబాలెం చెరువులో చేపలు పట్టిన యువకులు



మంగళగిరి: నగరంలోని శనివారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, చెరువులు తెగి జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. నగర పరిధిలోని విలీన గ్రామాల్లో చెరువులకు గండ్లు పడగా నీరు గ్రామాలలోకి చేరింది. యర్రబాలెం చెరువు కట్ట తెగడంతో రోడ్డుపైకి చేపలు కొట్టుకురాగా పలువురు యువకులు చేపలు పడుతూ కనిపించారు.

నకిలీ బంగారంతో రూ.కోటి రుణం

తెనాలి: జాతీయ బ్యాంకులో విలీనమై, ఆ పేరుతో కొనసాగుతున్న మారీసుపేటలోని ఓ బ్యాంకు శాఖలో స్థానిక వ్యాపారి ఒకరు నకిలీ బంగారు ఆభరణాలు తనఖా పెట్టి కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. బ్యాంకు అధికారులు రెండు రోజుల కిందట ఈ విషయం గమనించారు. దీనిపై రహస్యంగా విచారణ చేస్తున్నారు. పట్టణానికి చెందిన ఒక వ్యాపారి కొంతకాలం కిందట ఈ బ్యాంకులో గృహ నిర్మాణం నిమిత్తం రుణం తీసుకున్నాడు. తర్వాత అతడికి వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో రెండు నెలల కిందట అదే బ్యాంకులో నకిలీ ఆభరణాలు తాకట్టు పెట్టి తాను, కుటుంబసభ్యుల పేరుతో కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నాడని చెబుతున్నారు. సంబంధిత బ్యాంకు అప్రయిజరు, బ్యాంకు ఉద్యోగి పాత్ర కూడా ఇందులో ఉందని తెలుస్తోంది. రెండురోజుల క్రితం ఈ వ్యవహారాన్ని అధికారులు పసిగట్టారు. దీనిపై విచారణ జరుగుతోంది. వ్యాపారిని పిలిపించి ప్రశ్నించటంతో మరికొంతకాలం ఈ వ్యవహారాన్ని బహిర్గతం చేయకుండా ఉండాలని, అప్పటికి తాను రుణం మొత్తం చెల్లిస్తానని చెప్పాడట! అందుకోసం కొంత డబ్బు లంచం ఆశ చూపాడని చెబుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు సంబంధిత బ్యాంకు శాఖకు ఫోను చేస్తే లిఫ్ట్ చేయలేదు. బ్యాంకుకు వెళితే మేనేజరు లేరని సెక్యూరిటీ సిబ్బంది సమాధానం చెప్పారు.

నది మధ్యలోనే చిక్కుకున్న రావిలంక వాసులు

కొల్లూరు: కృష్ణా నది వరద, భారీ వర్షాలతో లంక గ్రామాలు శనివజలమయమయ్యాయి. పెసర్లంక అరవింద వారధి ఎగువన ఏర్పడిన గండి నుంచి వరద నీరు పల్లపు భూముల్లోకి ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన అడ్డుకట్ట సైతం కోతకు గురవుతోంది. బుడమేరు, మున్నేరు తదితర వాగులు, వంకలు నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వచ్చి చేరుతున్న సుమారు 50 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలే అవకాశం ఉందన్న ఆర్‌సీ అధికారులు అభిప్రాయంతో అడ్డుకట్టకు ముప్పు పొంచి ఉంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని శివరాంపురం, తిప్పలకట్ట, పల్లెపాలెం, ఓలేరు గ్రామాలలో పరిధిలోని నదీ తీరం వెంబడి పంట పొలాల కోతలు అధికమవ్వడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వరద నీరు గాజుల్లంక నుంచి చిన్నరేవులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కారణంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో పోతార్లంక, తోకలవారిపాలెం, తిప్పలకట్ట, కిష్కిందపాలెం, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాల ప్రజలు భట్టిప్రోలు మండలం వెల్లటూరు, కొల్లూరు మండలం గాజుల్లంకల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. చినరేవు నుంచి ప్రవహిస్తున్న వరద నీరు గాజుల్లంక, ఆవులవారిపాలెం, తోకలవారిపాలెం గ్రామాలలో పల్లపు భూముల్లోకి చేరింది. దీంతో ఇటుక బట్టీలతోపాటు స్వల్ప విస్తీర్ణంలో మిరప, అరటి వంటి పంటలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వానికి ముందు చూపు కొరవడటంతో నది మధ్యలో ఉన్న రావిలంక వాసులు చిక్కుకుపోయారు. పోతార్లంక శివారు రావిలంకకు పడవల ద్వారా రాకపోకలు సాగించడం మినహా ఎలాంటి మార్గం లేకపోవడంతో సుమారు 25 నుంచి 30 మంది వరకు రావిలంకలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వారిని తరలించకపోవడం యంత్రాంగ అసమర్థతకు నిదర్శనమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నదిలో వరద ప్రవాహం అధికంగా ఉండటం, పెనుగాలులు వీస్తుండటంతో పడవలు సైతం వెళ్లే అవకాశం లేవు. ఫోన్‌ల ద్వారా సమాచారం అందజేయడం మినహా వారికోసం ఏమీ చేయలేని పరిస్థితి అధికారులకు ఎదురైంది.



కొండుబోట్లవారి పాలెంలో నీట మునిగిన వరి పొలాలు



కొల్లూరు మండలం పోతార్లంక - దోనేపూడి మధ్య లో లెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద



మద్దిబోయినవారి పాలెంలో చెరువును తలపిస్తున్న పొలాలు

పునరావాస కేంద్రానికి 40 కుటుంబాలు

పేరలి(కర్లపాలెం): లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కర్లపాలెం తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. పేరలి గ్రామంలోని గిరిజన కుటుంబాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. తహసీల్దార్ వెంకటరత్నం, రెవెన్యూ సిబ్బందితో వెళ్లి అక్కడి వసతులను పరిశీలించారు.

పంట నష్టం తగ్గించేలా చర్యలు చేపట్టాలి

కొల్లూరు : ముంపు బారిన పడి పంట నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలను తక్షణం చేపట్టాలని జిల్లా ప్రత్యేకాధికారి ఎంవీ శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని పెసర్లంక, పెదలంక, చింతర్లంక ప్రాంతాలలో ఆయన పర్యటించారు. అరవింద వారధి వద్ద వరద తీవ్రతను పరిశీలించారు. అనంతరం లంక గ్రామాలలోని వాణిజ్య పంటల గురించి తెలుసుకున్నారు. వానల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు ఆయనకు వివరించారు. కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫోన్ నంబర్ 77948 94544 ను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రేపల్లె రూరల్: రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. శనివారం ఆమె స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. 08648 293795లో సంప్రదించాలని తెలిపారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు.



పేరలి హైస్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరత్నం

నీట మునిగిన వరి పైరు

కర్లపాలెం: కర్లపాలెం సెంటర్‌లో కురుస్తున్న వర్షపు నీరంతా పల్లపు ప్రాంతాన ఉన్న పశువైద్యశాల వద్దకు చేరటంతో ఆ ప్రాంతం తటాకాన్ని తలపిస్తోంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించాలని సిబ్బంది కోరుతున్నారు. మండలంలో సుమారుగా 9,638 ఎకరాలలో వరినాట్లు వేయగా.. 568 ఎకరాలలోని వరి పైర్లు నీట మునిగినట్లు అంచనా. మండలంలోని కర్లపాలెం, నర్రావారిపాలెం, పేరలిపాడు, తుమ్మలపల్లి, యాజలి, పేరలి కొత్తపాలెం, సమ్మెటవారిపాలెం, గ్రామాలలో అధికంగా వరిపైర్లు నీట మునిగాయి.

దెబ్బతిన్న ఉద్యాన పంటలు

బాపట్ల టౌన్: మండలంలోని ముత్తాయపాలెం, మద్దిబోయినవారి పాలెం, వల్లువారి పాలెం, పిన్నిబోయినవారి పాలెం, కొండుబోట్లవారి పాలెం, చింతావారి పాలెం, నందిరాజుతోట ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. వెదుళ్ళపల్లి, మరుప్రోలువారిపాలెం, పోతురాజు కొత్తపాలెం, బేతపూడి, మహాత్మాజీపురం, వైఎస్సార్‌నగర్, తులసీనగర్, నాగేంద్రపురం గ్రామాల్లో ఆకుకూరలు, కూరగాయలు, పూలతోటలు పూర్తిగా నీట మునిగాయి.

విజ్ఞాన్-న్యూకాన్ ఏరోస్పేస్‌ల మధ్య ఒప్పందం



తిలక్‌తో పత్రాలను మార్చుకుంటున్న వైస్ చాన్స్‌లర్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ – హైదరాబాద్‌లోని న్యూకాన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్‌ఏపీఎల్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్ శనివారం తెలిపారు. ఎన్‌ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్‌తో ఆయన అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాల్ని మార్చుకున్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వల్ల ఏరో స్పేస్ ఇంజినీరింగ్, డిఫెన్స్ టెక్నాలజీ రంగాల్లో ఉమ్మడిగా పరిశోధనలతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాల్ని అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని వివరించారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామని చెప్పారు. ఎన్‌ఏపీఎల్ ఆర్ అండ్ డీ జనరల్ మేనేజర్ జేఎల్‌పీ తిలక్ మాట్లాడుతూ విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖకు జేసీ సేవలు మరువలేనివి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల : రెవెన్యూ శాఖకు ఒక వనరుగా జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు పనిచేశారని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. సుబ్బారావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, బాపట్ల పార్లమెంటు సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్, బాపట్ల, చీరాల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, ఎం.మాలకొండయ్యలు కలిసి సుబ్బారావు, ఆయన సతీమణి పద్మలతలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉప కలెక్టర్లు ఆయనను ఘనంగా సత్కరించారు. అందరికీ సుపరిచితులుగా విధి నిర్వహణలో సమర్థంగా పనిచేశారన్నారు. బాపట్ల జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని బి. సుబ్బారావు అన్నారు. అందరి సహకారంతోనే ఈ స్థాయికి వచ్చానన్నారు. డీఆర్‌ఓ సి.హెచ్. సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి. రవీందర్, డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ధర్మచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వర నాయుడు, రెవెన్యూ అసోసియేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారావును సన్మానిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

రైళ్లలో చోరీలు చేస్తున్న యువకుడి అరెస్ట్

తెనాలి రూరల్: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి జీఆర్పీ స్టేషన్‌లో శనివారం వివరాలను ఎస్ఐ వెంకటాద్రి వెల్లడించారు. మార్చి 26న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలు ఉషాకుమారి బ్యాగ్ అపహరణకు గురైంది. ఈ నెల 25న లింగంపల్లి–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో మరో ప్రయాణికురాలి ల్యాప్ టాప్, బ్యాగ్ అపహరణకు గురవ్వగా గుడివాడ జీఆర్పీ స్టేషనులో కేసు నమోదైంది. కేసులను విచారించిన పోలీసులు నిందితుడిని తెనాలి యడ్ల లింగయ్య కాలనీకి చెందిన గాజుల సురేష్ అలియాస్ చిన్నిగా గుర్తించారు. అతడ్ని అదుపులోకి తీసుకుని బ్యాగులు, వాటిల్లోని ఏటీఎం కార్డులు, ల్యాప్ టాప్, పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే పల్లె నిద్ర ధ్యేయం

అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్

బాపట్లటౌన్: శాంతిభద్రతల పరిరక్షణే పల్లె నిద్ర ధ్యేయమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మండలంలోని కంకటపాలెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. తొలుత గ్రామంలోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు పాండురంగాపురం గ్రామంలో నిద్రించారు. సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని, అనుమానాస్పదంగా సంచరించే వారి కదలికల గురించి సమాచారం పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల సర్కిల్, రూరల్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కంకటపాలెం గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్

చైతన్య గ్రామీణ గోదావరి బ్యాంకు సేవలు భేష్

కొరిటిపాడు: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ 2023–24 వార్షిక నివేదికను గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బ్యాంకు అధికారుల సమక్షంలో కలెక్టర్ బ్యాంక్ బోర్డు డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత మాట్లాడుతూ 8 జిల్లాల్లోని 265 శాఖల ద్వారా 29.50 లక్షల మంది ఖాతాదారులకు బ్యాంక్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన బ్యాంకు నిర్వహణాధికారులు, సిబ్బందికి, ఖాతాదారులకు అభినందనలు తెలిపారు. బ్యాంక్ మొత్తం రుణాలలో 91శాతం వాటాను ప్రాధాన్యతా రంగం కింద కలిగి ఉండడాన్ని ప్రశంసించారు. బ్యాంక్ చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ పనితీరుపై కస్టమర్లు ఉంచిన నమ్మకానికి ఈ ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు.



వార్షిక నివేదిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

ప్లీజ్ సర్.. వర్షంలో పెన్షన్లు ఇవ్వలేను!

- నా లైఫ్ మిస్సయ్యేది
- డ్రేనేజీలో పడిన సచివాలయ ఉద్యోగిని వేడుకోలు

తెనాలి: కుండపోత వర్షంలోనూ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఓ సచివాలయ ఉద్యోగిని మృత్యువు వరకు తీసుకెళ్లాయి. ఎవరో చేయి పట్టి లాగకపోతే తన ప్రాణాలు పోయేవి. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఆగస్టు 31నే పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురుస్తుండటంతో ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా సచివాలయ ఉద్యోగులు పాటించారు. ఆ క్రమంలోనే పట్టణ 10వ సచివాలయం లక్ష్మీనగర్‌కు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ రమ్యకృష్ణ పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. ఆ క్రమంలో బుర్రిపాలెం రోడ్డులో వెళుతుండగా, పంట కాల్వలను తలపిస్తున్న ఆ రోడ్డులో అనుకోకుండా డ్రెయినేజీలో పడిపోయారు. వర్షం కారణంగా ఆ సమయంలో రోడ్డుపై జనం లేరు. అక్కడికి దగ్గర్లోని వాహనాల సర్వీస్ సెంటర్లో ఉన్న ఓ వ్యక్తి దీన్ని గమనించాడు. హుటాహుటిన వచ్చి ఆమె చేయి పట్టి బయటకు లాగడంతో ప్రాణం నిలిచింది. దుస్తులతోపాటు పింఛన్ల పంపిణీకి తెచ్చుకున్న బ్యాగ్, అందులోని నోట్ల కట్టలు తడిచిపోయాయి. అప్పటికే జ్వరంతో ఉన్న తాను, డ్రెయినేజీలో పడిపోయానని, ఆ వ్యక్తి చూడకుంటే తన ప్రాణం ఉండేది కాదని, పింఛన్లు పంపిణీ చేయలేనని, దయచేసి తన అభ్యర్థనను మన్నించమని కోరుతూ ఆడియో వాయిస్‌ను సంబంధిత గ్రూపులో పోస్టు చేశారామె!



తడిచిపోయిన నోట్ల కట్టలు